

నేడు మంత్రి జోగి రమేష్ రాక

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ మంగళవారం నాడు అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. విజయవాడ నుంచి మంగళవారం ఉదయం బయల్దేరి అనంతపురం రానున్నారు. ఉదయం 11 గంటలకు రాప్తాడు మండల పరిధిలోని ఆలమూరు జగన్న గృహ సముదాయ భవన నిర్మాణ పనులను పరిశీలించనున్నారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిపై అధికారులతో వివరాలను అడిగి తెలుసుకుంటారు. అనంతరం 12-30 గంటలకు అనంతపురం కలెక్టరేట్‌లో జిల్లాలో గృహ నిర్మాణ పనులపై హౌసింగ్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు.



గ్రీవెన్స్‌లో అర్జీదారుడి సమస్యను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

'స్పందన'పై నిర్లక్ష్యం వద్దు

ఫిర్యాదుదారులను సంప్రదించడం తప్పనిసరి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్పందన కార్యక్రమంలో ప్రజలు అందించే అర్జీలపై ఎలాంటి నిర్లక్ష్యం చూపకుండా త్వరితగతిన వాటికి పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్‌తో కలిసి స్పందన గ్రీవెన్స్ కార్యాక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన అర్జీలకు సమాధానాలు ఇచ్చేముందు ఫిర్యాదుదారున్ని సంబంధిత అధికారులు తప్పనిసరిగా సంప్రదించాలని సూచించారు. ఫిర్యాదుదారునితో సంప్రదించిన ఫొటోను గ్రీవెన్స్ వెబ్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి అర్జీకి నిర్ణీత సమయంలోగా నాణ్యమైన పరిష్కారాలు చూపాలని అధికారులను ఆదేశించారు. అధికారులు అప్లోడ్ చేస్తున్న ఫొటోల్లో నాణ్యత మెరుగవాలన్నారు. అధికారులు చూపే ప్రతి పరిష్కారాన్ని పర్యవేక్షణ చేసే దిశగా జిల్లా అధికార యంత్రాంగం అడుగులు వేస్తోందన్నారు. ఇప్పటికే అక్కడక్కడా సమాధానాలను పరీక్షించేందుకు కమిటీ ఏర్పాటు చేశామన్నారు. మొక్కుబడిగా, తప్పుల తడకలతో సమాధానాలు ఇచ్చే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో గాయత్రీ దేవి, ఆర్డీవో మధుసూదన్, డీఆర్డీఏ పీడీ నరసింహారెడ్డి, జెడ్పీ సీఈవో భాస్కర్‌రెడ్డి, ఆన్‌సెట్ సీఈవో కేశవ నాయుడుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మూగజీవాలపై 'ముద్దచర్మం'

◆ పశువుల ప్రాణాలు తీస్తున్న లంపీస్కిన్ ◆ కొనసాగుతున్న ఎద్దుల మరణాలు



ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా పశువులపై ముద్దం చర్మం వ్యాధి దాడి చేస్తోంది. ఈ వ్యాధి గత నెల రోజులుగా పాడిరైతులను తీవ్ర కలవరపాటుకు గురి చేస్తోంది. ప్రారంభంలో సాధారణ జబ్బుగా దీనిని భావించారు. అయితే ఒక్కసారిగా పశువుల ప్రాణాలు పోతుండడతో తీవ్ర కలవారపాటుకు గురవుతున్నారు. మడకశిర మండల పరిధిలోని అగళి, గుడిబండ, రొళ్ల తదితర మండలాల్లో ఇప్పటికే ఈ వ్యాధితో మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. సోమవారం నాడు గుడిబండ మండలంలో ఓ ఆవు మృతిచెందింది. ఒక్క అగళి మండలంలోని వారం రోజుల వ్యవధిలో 12 పశువులు మృతి చెందాయి. మరికొన్ని దీని భారినపడి ఇబ్బంది పడుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో వ్యవసాయానికి అనుబంధంగా పాడిపరిశ్రమపై ఆధారపడి రైతులు జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయానికి ఎద్దులు, పాడి కోసం ఆవులను మేపుతుంటారు. ఉన్న ఫలంగా వీటికి లంపీస్కిన్ వ్యాధి వ్యాపిస్తోంది. ముందుకు ఈ వ్యాధి ప్రారంభంలో పశువుల కళ్లు, ముక్కు, నోటి నుంచి చొంగకారుతుంది. ఆ తరువాత చర్మం కింద నోటి చిగురు, ముక్కు దూలం మీద గడ్డలు లాంటివి కన్పిస్తాయి. తరువాత మెడ, తొడల దగ్గర లిప్ గ్రంథలు వాచి పొదుగు, రొమ్ము భాగం కీళ్లలో నీరు చేరి పశువు నీరసంగా మారుతుంది. తినడం పూర్తిగా మానేస్తుంది. కనీసం కదలేందుకు కూడా వీల్లేకుండా కింద పడుకుండిపోతుంది. ఈ వ్యాధి జిల్లాలో అక్టోబర్ నెలలోనే వచ్చినట్లు తెలుస్తోంది. ప్రారంభంలో సాధారణ జబ్బుగానే దీనిని భావించారు. అయితే పశువులు మృత్యువాత పడ తుండడంతో దీనిపై ఆందోళన మొదలైంది. అంటువ్యాధిలా ఇది వ్యాపించి ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి ఇది విస్తరిస్తోంది. ఈ వ్యాధికి గురైన పశువు నోరు, నాసిక, కంటి నుంచి కారే ప్రవాల ద్వారా ఈ వైరస్ ఎక్కువ మోతాదులో ఉన్నట్లు తెలుస్తోంది. పశువుల మేత, నీటి తొట్టెల ద్వారా కూడా విస్తరిస్తోంది. పాలుతాగే లేగదూడులకు తల్లపాల ద్వారా లేదా పొదుగుపై ఉన్న చర్మం పొక్కుల ద్వారా సోకుతుందని పశువైద్యాధికారులు చెబుతున్నారు.



లంపీస్కిన్ వ్యాధితో ఈ నెల 10వ తేదీన అగిళ మండలంలో మృతి చెందిన ఎద్దు

ముందుగానే గుర్తించాలి

లంపీస్కిన్ వ్యాధిని ముందుస్తుగానే గుర్తించి చికిత్సలు చేయడం ద్వారా కొంత మరణాన్ని తగ్గించే అవకాశం ఉంటుందని పశువైద్యాధికారులు చెబుతున్నారు. ఈ వ్యాధికి ఇప్పటి వరకు పూర్తి స్థాయి చికిత్సలు లేని నేపథ్యంలో అవగాహనతో ముందస్తు చికిత్స చేసుకోవడమే మంచిదని సూచిస్తున్నారు. వ్యాధి రాకుండా ముందస్తుగా గోటాఫాక్స్ వ్యాక్సిన్, వ్యాధి వస్తే యాంటీ బయాటిక్స్ వాడాల్సి ఉంటుందని సూచిస్తున్నారు.

రాళ్లపల్లిలో ముద్ద చర్మవ్యాధితో ఎద్దు మృతి

మడకశిర : పశువులను కబళిస్తున్న లంపీస్కిన్ మడకశిర నియోజకవర్గంలో కలకలం రేపుతోంది. గుడిబండ మండలం రాళ్లపల్లి గ్రామంలో ఈ వ్యాధితో ఎద్దు మృతిచెందింది. గుడిబండలో పశువుల సంత వారంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్నారు. పశు వైద్యాధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టకపోవడం వల్లనే ముద్దచర్మ వ్యాధి మడకశిర ప్రాంతంలో ప్రబలిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పశువుల మృతిపై రాష్ట్ర టిడిపి కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి పశు వైద్యశాలను సందర్శించి తగిన చికిత్స అందించి వ్యాధిని అరికట్టాలని పశు వైద్యాధికారి జయకుమార్‌ను కోరారు.



సోమవారం నాడు గుడిబండ మండలం రాళ్లపల్లి గ్రామంలో మృతి చెందిన ఎద్దు

గ్రంథాలయాలతో విజ్ఞానం

వారోత్సవాల ప్రారంభంలో ఎమ్మెల్యే అనంత



గ్రంథాలయ వారోత్సవాల ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనంత, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉమా మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

గ్రంథాలయాల సేవలను విద్యార్థులు, నిరుద్యోగులు, పాఠకులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. సోమవారం నాడు 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం.ఉమామోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు, పాఠకులతో వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఈ స్థాయిలో ఉన్నామంటే గ్రంథాలయాల వల్లనే అన్నారు. గ్రంథాలయాల్లో పుస్తకాలు చదివి అనేక విషయాలు తెలుసుకున్నట్లు చెప్పారు. పుస్తక పఠనం చేయడం ద్వారా జ్ఞాపకశక్తి పెంపొందుతుందని తెలియజేశారు. విద్యార్థులు, నిరుద్యోగులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎల్‌ఎం.మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల
సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్



డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు పిఎఫ్, ఎపిజిఎల్ఐ, డీఏ అరియర్లు, సరెండర్ లీవులు, ఇతర ఆర్థిక సంబంధమైన బకాయిలను వెంటనే విడుదల చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నాడు డిఆర్ఒ గాయత్రి దేవిని కలసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో పని చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సన బకాయిలు తక్షణమే ఇవ్వాలన్నారు. పిఎఫ్, ఎపిజిఎల్ఐ, డిఏ అరియర్స్, సరెండర్ లీవులు, రిటైర్డ్ ఉద్యోగుల పిఎఫ్, ఎపిజిఎల్, ఎరండ్‌లీవ్స్ ఎన్ క్యాష్ మెంట్, గ్రాట్యుటీ, కమ్యుటేషన్ బకాయిలు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రూ.1826 కోట్లు మేర చెల్లింపులు చేయాల్సినవి ఉన్నాయని, తక్షణం వీటిని ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో 22వ తేదీన యుటిఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు శేషప్ప, సుబ్బరాయుడు, వీరాచారి, హెంశ్రీ, గంగాధర్, చంద్రమోహన్, శివప్రసాద్ పాల్గొన్నారు.

కక్షపూరితంగా వ్యవహరించడం పద్ధతి కాదు : బండారు శ్రావణిశ్రీ

నార్పల : అధికార పార్టీ నాయకుల మాటలు విని టిడిపి కార్యకర్తల పట్ల అధికారులు కక్షపూరితంగా వ్యవహరించడం మంచి పద్ధతి కాదని నియజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ అన్నారు. సోమవారం నార్పల మండలంలోని మంగపట్నం గ్రామంలో టిడిపి సీనియర్ కార్యకర్త నరసింహారెడ్డి ఇంటి ముందు సీసీ రోడ్డు వేయడానికి ప్రహరీ, మరుగుదొడ్లు కూల్చివేశారు. దీంతో విషయం తెలుసుకున్న శ్రావణీ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ప్రహరీ, మరుగుదొడ్లను దౌర్జన్యగం తొలగించడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు బాధితుల తరపున పోరాడుతామని తెలిపారు.

పేదల ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు

మంత్రి ఉషశ్రీ చరణ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

పేదల ఇళ్ల వద్దకే సంక్షేమ ఫలాలు అందజేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడంతోపాటు సంక్షేమ పథకాలపై ఆరాతీస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక పార్టీలకు అతీతంగా వృద్ధాప్య పింఛన్, ఆసరా, అమ్మఒడి, జగనన్న గృహాలు, సున్నా వడ్డీకే రుణాలు వంటి పథకాలను అందజేస్తున్నామన్నారు. కావున రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధించాలంటే తిరిగి జగనన్నను గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు..



మహిళతో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్



కలెక్టర్‌కు విన్నవిస్తున్న సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు

స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్‌కు విన్నవించిన వామపక్ష పార్టీల నేతలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శ్రీసత్యసాయి వాటర్ సప్లై కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు, సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.నాగేంద్రకుమార్, రామాంజినేయులు తదితరులు హాజరై సమస్యలపై వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 రోజులుగా శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికులు సమ్మె చేస్తున్నారని తెలిపారు. అధికారులు నోటి మాటలతో సరిపెడుతున్నారు తప్ప లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వడం లేదన్నారు. ఎల్,టి కంపెనీ నుంచి రావాల్సిన గ్రాట్యూటీ డబ్బులు కార్మికులందరికి చెల్లించాలన్నారు. మృ చెందిన కార్మికులు, రిటైర్డ్ అయిన కార్మికులందరికి ఇవ్వాలని కోరారు. బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ రూ.కోటి 70 లక్షలు మృతి చెందిన కార్మికులకు, రిటైర్ అయిన కార్మికులకు చెల్లిస్తారని, మిగతా వారందరికి మార్చి లోగా పూర్తి స్థాయిలో చెల్లిస్తారని హామీ ఇచ్చారు. దీంతో నాయకులు కార్మికులతో మాట్లాడి సమ్మె విరమణపై ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామాంజి, వెంకటనారాయణ, బాబు తదితరులు పాల్గొన్నారు.

సహకార వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

ఎడిసిసి బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఛైర్ పర్సన్ లిఖిత సహకార పతాకాన్ని ఎగరవేసి వారోత్సవాలను సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకార రంగం అభివృద్ధికి కట్టుబడి ఉన్నాయన్నారు. రైతులకు సకాలంలో వివిధ రకాలైన రాయితీలను అందచేస్తున్నాయన్నారు. ముఖ్యఅతిథి సహకార అధికారి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ.. అమూల్ సంస్థలు సహకార రంగానికి చేయూతనిస్తున్నాయన్నారు. జగనన్న పాలవెల్లువ ద్వారా పాడి రైతులు లబ్ధిపొందుతున్నారని తెలియజేశారు. సిఇఒ రాంప్రసాద్ మాట్లాడుతూ సిబ్బంది కష్టపడి పనిచేసి సహకార సంస్థల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రాయలసీమ సహకార శిక్షణ సంస్థ ప్రిన్సిపల్ శ్రీనివాసులు సహకార వార్షికోత్సవాల విశిష్టత గురించి తెలియజేశారు. సహకార ధన వర్ష డిపాజిట్ స్కీం (666 రోజులు)కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వడ్డీ రేటు 7.63 శాతమని సీనియర్ సిటిజెన్లకు 8.35 శాతం వరిస్తుందని తెలిపారు. ద్విచక్ర, ముడు చక్రాలు, నాలుగు చక్రాల వాహనాల రుణాలకు సంబంధించి గోడ పత్రికలను విడుదల చేశారు. అతి తక్కువ వడ్డీ (8.50%) రుణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఖతాదారులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలోమ డిఆర్ ఒఎస్‌డి సూర్యనారాయణ, అప్కాబ్ అధికారి దినేష్‌బాబు, బ్యాంకు డిజిఎం సుఖదేవ్ బాబు, బ్యాంకు సిబ్బంది, సహకార శాఖ సిబ్బంది, ఆర్‌సి టిసి శిక్షణార్థులు పాల్గొన్నారు. రాయలసీమ సహకార శిక్షణ సంస్థల్లో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు సహకార పతాకాన్ని ఆవిష్కరించారు.



సహకార వారోత్సవాల పోస్టర్లను విడుదల చేస్తున్న ఎడిసిసి బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, బ్యాంకు సిబ్బంది

ఎస్ఎస్‌బిఎన్ కళాశాల అక్రమాలపై విచారించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

అనంతపురంలోని ఎస్ఎస్‌బిఎన్ కళాశాలలో చోటు చేసుకున్న అక్రమాలు, అవకతవకలపై విచారణ చేపట్టాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం రాయదుర్గం వినాయక కూడలిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బంగి శివ, ఎఐఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షుడు అంజి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఎస్ఎస్‌బిఎన్ కళాశాలలో జరిగిన అవినీతి కుంభకోణాన్ని వెలికితీసి విద్యార్థులకు తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఫణి, రాము, వంశీ, పవన్, శీన, తరుణ్, యువరాజ్, ఎఐఎస్ఎఫ్ నాయకులు అరుణ్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



రాయదుర్గంలోని వినాయక కూడలిలో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు

కళ్యాణదుర్గం : ఎస్ఎస్‌బిఎన్ కళాశాలలో జరిగిన అక్రమాలపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఐవైఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేయడం చేశారు. ఈమేరకు స్థానిక కార్యాలయంలో సోమవారం ఆర్డీవోకు వినతిపత్రం సమరింపచారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వంశీ, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు హనుమంతురాయుడు, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు తిలక్ మాట్లాడుతూ విద్యార్థులకు సంబంధించిన రూ.43,39,065 సొమ్మును పట్టించారని న్యాయవాది విఠల్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయాలని న్యాయస్థానం ఆదేశించడంతో అవినీతి, అక్రమాలను వెలుగులోకి వచ్చాయన్నారు. కళాశాల పరువు, ప్రతిష్టను కాపాడుకునేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వెంటనే ఉన్నతాధికారులు సమగ్రంగా విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు అరవింద్, ధనుష్ నాయకులు, అరవింద్, పవన్, ఆదర్శ, బ్రహ్మయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా భక్తకనకదాస జయంతి

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్లు మండలం డోనేకల్లు గ్రామంలో భక్త కనకదాస జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. కురువ సంఘం ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులతో కలిసి విశ్వేశ్వరరెడ్డి కనకదాస చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భక్త కనకదాస గొప్ప వ్యక్తి అని అన్నారు. ఆ మహనీయుని అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. కనకదాస గొప్పతనాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వారి జన్మదినాన్ని అధికారికంగా నిర్వహించాలని సిఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు బసన్న, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, విడపనకల్లు జెడ్పిటిసి హనుమంతు, వైస్ ఎంపిపి పుష్పావతి, భీమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కురుబ రమేష్, కడదర బెంచి సర్పంచి దేవరాజు, కరణం భీమరెడ్డి, మాజీ జెడ్పిటిసి తిప్పయ్య, నాయకులు గోపాలకృష్ణ, పిఎసిఎస్ డైరెక్టర్ బ్యాళ్ల ప్రసాద్, కురుబ చిన్న భీమా తదితరులు పాల్గొన్నారు.

దయాబెటిస్ డేపై అవగాహన ర్యాలీ

అనంతపురం : ప్రపంచ డయాబెటిస్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులు, వైద్య అధ్యాపక సిబ్బంది సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మైరెడ్డి నీరజ మాట్లాడుతూ జీవన ప్రమాణాలు మెరుగవుతాయని తెలిపారు. కార్యక్రమంలో సామాజిక వైద్యశాస్త్రం విభాగాధిపతి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీదేవి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మధు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సుమన, డాక్టర్ సుష్మ, నిహారిక, అరుణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లంపీ స్కిన్ వైరస్‌ను అరికట్టాలి

ఆత్మకూరు : లంపీ వైరస్‌ను అరికట్టాలని, గ్రామాల్లో పశువులకు వ్యాక్సిన్ వేయాలని సిపిఐ మండల కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో పశువైద్యాధికారి తులసీరామ్ రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండారు శివ, ముత్యాలన్న, నరసింహులు, సరోజమ్మ, చిన్న ముత్యాలు, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి

ఉరవకొండ : అంగన్వాడీ సెంటర్లలో మౌలిక వసతులు కల్పించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఉరవకొండ డివిజన్ అధ్యక్షురాలు విజయమ్మ డిమాండ్ చేశారు. సోమవారం గడేకల్ గ్రామ సచివాలయం అధికారులకు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు భారతీదేవి, నిర్మలాదేవి, గాయత్రిదేవి, లక్ష్మి, రాజమ్మ, ఆయాలు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



కోర్టు రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాలలో

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక ఆదిమూర్తి నగర్‌లోని శ్రీ చైతన్య పాఠశాలల ఏపిపి 9వ బ్రాంచి, కోర్టు రోడ్డులోని బ్రాంచి, రుద్రంపేట బైపాస్‌లోని ఏపిపి 10వ బాంచి, హౌసింగ్‌బోర్డులోని ఏటిపి-8 నందు బాలల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఏజిఎం సుబ్బారెడ్డి హాజరయ్యారు. బాలల దినోత్సవం ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. వివిధ వేషధారణలు, నృత్యాలతో విద్యార్థులు అలరించారు. ప్రిన్సిపల్ తబస్సుం, శ్రీదేవి, కోఆర్డినేటర్లు, తిరుమలేష్, శ్రీనివాసరావు, డీన్ సతీష్, రిషిత, ప్రైమరీ ఇన్‌ఛార్జి సరిత, రమాదేవి, నీరజ, భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సరస్వతి విద్యానికేతన్‌లో..

స్థానిక పాపంపేట నందు ఉన్న సరస్వతి విద్యానికేతన్ హై స్కూల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కరస్పాండెంట్ రామచంద్ర పాల్గొన్నారు. విద్యార్థుల వేషధారణలు అలరించాయి. కార్యక్రమంలో 'హెచ్‌ఎం జేబీనా, ఏవో బాషా, రోజా, అంజి, అరవింద్, పాధ్యాయులు పాల్గొన్నారు.

సాయి విజ్ఞాన్ పాఠశాలలో..

మూడో రోడ్డులోని సాయి విజ్ఞాన్ పాఠశాలలో ఘనంగా బాధల దినోత్సవం నిర్వహించారు. డైరెక్టర్లు ఎంపీ



నవభారత్ పాఠశాలలో..

శ్రీనివాసులు, కరుణాకర్, పాఠశాల ప్రిన్సిపల్ లావణ్య, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

జెఎన్‌టియులో..

జెఎన్‌టియు పరిపాలనా భవనంలో ఉపకులపతి రంగజనార్ధన నెహ్రూ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రెక్టార్ ఆచార్య విజయకుమార్, రిజిస్ట్రార్ ఆచార్య శశిధర్, యూనివర్శిటీ డైరెక్టర్లు ఆచార్య కేశవరెడ్డి, ఆచార్య సుమలత, ఆచార్య భానుమూర్తి, ఆచార్య కిరణ్మయి, ఆచార్య శోభా బిందు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి : బాలల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఆరవ అదనపు న్యాయమూర్తి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జె.కబర్ది పేర్కొన్నారు. పట్టణంలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో చైల్డ్ లైన్ (1098) ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రభాకర్ అధ్యక్షతన ఏర్పాటైన సభలో ఏడీజే మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్ బివి.నరసారెడ్డి, ఎంఈఓ బి.రవినాయక్, సిడిపిఒ ఆగ్నెస నాగమణి, హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ పీడీ ఎం.నారాయణస్వామి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.నాగేశ్వరి, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ బాలాజీ, సభ్యులు అశ్విని, భాగ్యలక్ష్మి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలోని సరస్వతి శిశు మందిరంలో సోమవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శిశు మందిరం స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని ఉమ్మడి అనంతపురం జిల్లాలో 28 పాఠశాలలకు చెందిన 800 మంది విద్యార్థులు ఆటల పోటీల్లో పాల్గొనగా స్థానిక శిశు మందిరానికి చెందిన విద్యార్థిని ఎన్.పూజప్రియ 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచింది. విద్యార్థినికి ప్రశంసా పత్రంతోపాటు మెమొంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ అధ్యక్షులు ధనార్జున, కార్యదర్శి తుకారం, సహాయ కార్యదర్శి రామాంజినప్ప, ప్రధానోపాధ్యాయిని రాజేశ్వరి, లయన్స్ క్లబ్ కార్యదర్శి అశోక్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : నేటి బాలురే రేపటి పౌరులని లిటిల్‌రోజెస్ ప్రయివేట్ పాఠశాల కరస్పాండెంట్ అభిలాష్ అన్నారు. సోమవారం బాలల దినోత్సవం సందర్భంగా భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన పోటీలు, క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ దీపువాణి, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణంలో జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాఘవయ్య ముఖ్యఅతిథిగా హాజరై నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పరమేష్, సిఐటియు నాయకులు శివశంకర్, ఐద్వా నాయకురాలు రాజేశ్వరమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : చుక్కలూరు ప్రభుత్వ పాఠశాలలో చిరంజీవి మెగా ఫ్యాన్స్ సభ్యులు బాలలదినోత్సవాన్ని నిర్వహించారు. పిల్లలకు నృత్యపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మెగా ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు ఆటో ప్రసాద్, రబ్బాని, సాదిక్, ఇమామ్‌వలి, రవి, అల్తాఫ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల బాలికల పాఠశాలలో ప్రిన్సిపల్ సంగీత కుమారి నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

అధిక వర్షాలకు తెగులు సోకి నష్టపోయిన మిర్చి రైతులను ఆదుకోవాలని, కౌలు రైతులందరికీ సిసిఆర్‌సి కార్డులు వెంటనే మంజూరు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఉరవకొండలోని అగ్రికల్చర్ ఏడీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరవకొండ డివిజన్ పరిధిలో దాదాపు 53,000 వేల ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశారన్నారు. మీల్ట్, నల్లి తెగులు సోకి మిర్చి పంట పూర్తిగా దెబ్బతినిందన్నారు. వైరస్ సోకిన మిర్చి పంటను రైతులు తొలగించారన్నారు. వ్యవసాయ అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పంట తొలగించిన రైతు వివరాలను సేకరించి నివేదికలు సిద్ధం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం వినతిపత్రాన్ని ఎడిఎ పద్మజకు అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శులు జ్ఞానమూర్తి, మధుసూదన్, కౌలు రైతు సంఘం నాయకులు సిద్ధప్ప, వన్నూరు స్వామి, నరసింహులు పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్ రాజకీయ అజ్ఞాని

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ



బుక్‌లెట్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

పవన్‌కళ్యాణ్ ఓ రాజకీయ అజ్ఞాని అని, రాజకీయాలపై అవగాహన లేని వ్యక్తి అని, అలాంటి పవన్ కళ్యాణ్ 'నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంపై దుష్ప్రచారం చేయడాన్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి వ్యాఖ్యానించారు. విడపనకల్లు మండలం డోనేకల్లు గ్రామంలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విశ్వ మీడియాతో మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడమే లక్ష్యంగా పవన్ కళ్యాణ్, చంద్రబాబు పనిచేస్తున్నారని విమర్శించారు. దేశంలో ఎక్కడా జరగని విధంగా రాష్ట్రంలో జరుగుతున్న ఈ అతిపెద్ద కార్యక్రమంలో బొక్కలు వెతకడం వారి చేతకాని తనానికి నిదర్శనం అన్నారు. పేదవాడికి ఒక్క సెంటు స్థలం కూడా ఇవ్వని.. ఒక్క ఇళ్లు కూడా నిర్మించని చంద్రబాబును పవన్‌కళ్యాణ్ ఎందుకు ప్రశ్నించలేదని ప్రశ్నించారు. జనసేన పిల్ల నాయకులు నలుగురు ప్లకార్డులు పట్టుకొని తిరిగితే ప్రజలు నమ్మరన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు బసన్న, సిపి వీరన్న, జెడ్పిటిసి హనుమంతు, వైస్ ఎంపిపి పుష్పావతి భీమరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేష్, వైసిపి నాయకులు భీమ్‌రెడ్డి, తిప్పయ్య, గోపాలకృష్ణ, దేవరాజు, కేసన్న, ఉమామహేశ్వర్, మునిస్వామి, అశోక్, ఓబులేసు, బద్రీ, ఎంపీడీవో శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

లంచం ఇవ్వకుంటే ఇంటి బిల్లు ఇవ్వరా..?

ప్రజాశక్తి-ఉరవకొండ

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నా లంచం ఇవ్వకుంటే బిల్లులు మంజూరు చేయరా అంటూ ఉరవకొండ పట్టణానికి చెందిన చింతా శేఖర్, ఆయన భార్య యశోద ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి నిర్మాణం పూర్తి అవుతున్నా బిల్లు మంజూరు చేయకపోవడంతో వారు గృహ నిర్మాణ శాఖ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. వారు మాట్లాడుతూ స్థానిక లక్ష్మీనరసింహ కాలనీలో తమకున్న సొంత స్థలంలో ప్రభుత్వం మంజూరు చేసే ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్నామన్నారు. సంబంధిత శాఖ అధికారులు ఇంటి స్థలాన్ని పరిశీలించి నిర్మాణానికి అనుమతులు ఇచ్చారన్నారు. ఆన్‌లైన్‌లో ఐడి నెంబరు కూడా నమోదు అయిందన్నారు. సిమెంటు, ఇసుకతో పాటు బిల్లు ఇవ్వాలని నాలుగు నెలలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా బిల్లులు మంజూరు చేయలేదన్నారు. దీనిపై ప్రశ్నిస్తే ఏఈ రూ.10 వేలు ఇస్తే బిల్లు చేస్తామని చెప్పారన్నారు. తాము అంత డబ్బు ఇవ్వలేమని చెప్పామన్నారు. మీ ఇంటి నిర్మాణం వెనక పాతగోడ ఉందని అందుకే బిల్లులు మంజూరు చేయడంలేదని తమను ఏఈ వేధిస్తున్నారని వాపోయారు. లక్షలాది రూపాయలు అప్పుచేసి ఇంటి నిర్మాణం చేపట్టామన్నారు. బిల్లులు మంజూరు చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమని అన్నారు. అనేక మంది గృహనిర్మాణ లబ్ధిదారులు అక్కడకు చేరుకుని హౌసింగ్ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపి వారికి సంఘీభావం తెలిపారు. వారి దీక్షకు సిపిఎం, రైతు సంఘం నాయకులు మద్దతు తెలిపారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కమిషనర్ భాగ్యలక్ష్మి నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను సోమవారం పరిశీలించారు. ముందుగా ఉదయం 5:30 గంటలకు నగరంలోని 4వ సర్కిల్ మస్టర్ కార్యాలయ నందు పారిశుధ్య కార్మికుల హాజరు పట్టికను పరిశీలించారు. పారిశుధ్య కార్యదర్సులకు పలు సూచనలు చేశారు. తదుపరి నగరంలోని గుత్తి రోడ్డు, నీరుగంటి వీధి, తిలక్ రోడ్డు, రాజు రోడ్డు, గుల్జార్ పేట, కోర్ట్ రోడ్డు తదితర ప్రాంతాలలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని నగరపాలక అసిస్టెంట్ ఇంజినీర్ బాబావాలికి సూచించారు. గుల్జార్‌పేటలో గతంలో ఇళ్లకు వెనుక వైపున మురుగునీటి పైపులు వేసుకున్నారు. వాటిని ముందు వైపు కొత్తగా నిర్మించబోవు కాలువలకు ఏర్పాటు చేసుకునేవిధంగా నోటీసులు ఇవ్వాలని కమిషనర్ ఆదేశించారు.

వికలాంగుల సమస్యల పరిష్కారానికి పోరాటం

ఎన్‌పిఆర్‌డి జిల్లా మహాసభ పిలుపు



మహాసభలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి పోరాటాలను ఉధృతం చేస్తామని వక్తలు పిలుపునిచ్చారు. సోమవారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో రెండో మహాసభ నిర్వహించారు.. ఈ మహాసభకి అధ్యక్షత వహించిన కుమార్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో వికలాంగుల సమస్యలపై పోరాటాలు చేస్తామని చెప్పారు. ముఖ్యఅతిథి సిఐటియు జిల్లా నాయకులు ఆర్‌వి.నాయుడు మాట్లాడుతూ వికలాంగులు సమాజంలో నిరాదరణకు, వివక్షకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వాలు కూడా వీరి సంక్షేమం చేసింది శూన్యం అన్నారు. నిధులు తగినంతగా ఇవ్వడం లేదన్నారు. వికలాంగుల చట్టాన్ని అమలుచేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు భర్తీ చేయకపోగా కొత్త నియామకాలూ చేపట్టడం లేదన్నారు. వికలాంగులకు ప్రభుత్వం నిత్యావసర సరుకులకు రూ.7500 ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఆఫీసుల దగ్గర ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. వికలాంగులకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించాలని, అంత్యోదయ కార్డులు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న మ్యారేజ్ ఇనిషియేటివ్ విడుదల చేయాలని, త్రీ వీలర్ మోటార్ సైకిల్ ఉచితంగా ఇవ్వాలని, ఎనిమిదో విడత భూ పంపిణీలో మూడు ఎకరాల భూమి ఇవ్వాలని, పూచీకత్తు లేకుండా రూ.5 లక్షలు బ్యాంకు రుణాలు ఇవ్వాలని, మూడు సెంట్లు స్థలంతోపాటు ఇల్లు ఉచితంగా కట్టించి ఇవ్వాలని, సదరన్ క్యాంపులు మండలాల్లో ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వసంత కుమార్, కార్యదర్శిగా ఎం.రామయ్య, ఉపాధ్యక్షులు భైరవరెడ్డి, మారెప్ప, సహాయ కార్యదర్శులుగా శివమ్మ, కుమార్, ట్రెజరర్‌గా శ్రీనివాసులు, కమిటీసభ్యులుగా రామాంజనేయులు, కుల్లాయప్ప, నార్పల శివలింగ, పెద్దిరాజులు, వీరభద్రప్ప, ఈశ్వరమ్మ, నారాయణరెడ్డి, వైష్ణవి, సోమశేఖర్, హరిలను ఎన్నుకున్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి



రాయదుర్గంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పోరాలు శిల్ప

రాయదుర్గం : విద్యార్థులు చిన్ననాటి నుంచే గ్రంథాలయాలను ఉపయోగించుకుని చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పోరాలు శిల్ప చెప్పారు. సోమవారం రాయదుర్గంలోని ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. అంతేకాక బాలల దినోత్సవం సందర్భంగా మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి ఆదిలక్ష్మి, మున్సిపల్ వార్డు సభ్యులు లావణ్య, మమత, పదవీ విరమణ చెందిన ఉపాధ్యాయులు బదరీ నారాయణ, శ్రీరామరెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : పట్టణంలోని గ్రంథాలయ కార్యాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ, ఫిజికల్ డైరెక్టర్ శివమ్మ, ఉపాధ్యాయులు హరి, గ్రంథాలయ సిబ్బంది ఉమామహేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడిపత్రి : స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను సోమవారం ప్రారంభించారు. పిల్లలతో గ్రంథాలయ ప్రతిజ్ఞ చేశారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి బి.రవికుమార్ నాయుడు, పి.శివప్రసాద్ రాజు, హెచ్‌ఎం ప్రవీణ్‌కుమార్, పీడీ, ఉపాధ్యాయులు మంజునాథ, నాగరాజు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, నారాయణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : గ్రంథాలయ వారోత్సవాలను స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం ప్రారంభించారు. గ్రంథాల అధికారి విజయభాస్కర్, సుగుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరవకొండ : విడపనకల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి మీనుగ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రంథాయల వారోత్సవాలను ప్రారంభించారు. వైస్ ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పంచాయతీ సెక్రెటరీ మహబూబ్ బాషా, సిపిఐ చెన్నరాయుడు, ప్రధానోపాధ్యాయులు విజయ్‌మోహన్, ఉపాధ్యాయుడు శ్రీకంఠ, విద్యార్థులు పాల్గొన్నారు.

గుత్తి : గ్రంథాలయాల వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను మున్సిపల్ చైర్ పర్సన్ డి.వన్నూర్ బీ, కమిషనర్ బివి. నరసరెడ్డిలు విడుదల చేశారు. ముందుగా పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రామాంజీనేయులు ఆధ్వర్యంలో గ్రంథాలయాల వారోత్సవాలను ప్రారంభించారు. వైసీపీ నాయకుడు షఫీ, సామాజిక కార్యకర్త మహమ్మద్ సలీం, సిద్ధార్థ, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నార్పల : గ్రంథాలయ అధికారి శిరీష ఆధ్వర్యంలో గ్రంథాలయల వారోత్సవాలను ప్రారంభించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్లూరు : స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాలను గ్రంథాలయ అధికారి జయరాములు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జెడ్‌పిహెచ్‌ఎస్ స్కూల్ హెడ్మాస్టర్ లక్ష్మీనరసింహులు, భూమిరెడ్డి పెద్ద నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు సురేష్, పురుషోత్తంరెడ్డి, రాజశేఖర్, మల్లికార్జున, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూని ఆదర్శంగా ఆదర్శంగా తీసుకొని ఆయన అడగజాల్లో నడుద్దామని తగ్గుపర్తి గ్రంథాలయ అధికారి పురుషోత్తం నాయుడు, బెలుగుప్ప గ్రంథాల అధికారి ప్రతాపరెడ్డి అన్నారు. సోమవారం తగ్గుపర్తి, బెలుగుప్ప గ్రంథాలయాల్లో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయం స్థలదాత వెంకటనారాయణ, రాజగోపాల్, ప్రధానోపాధ్యాయులు స్వర్ణలత, ఉపాధ్యాయులు చెన్నకేశవరెడ్డి గ్రామస్తులు వెంకట్ నాయుడు, ప్రసాద్, చెన్నకేశవులు, నాగమణి పాల్గొన్నారు.

ఎస్‌కెయులో అధ్యాపకులకు ఉద్యోగోన్నతి

అనంతపురం : ఎస్కేయూలో ఆరుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా కెరీర్ అడ్వాన్స్ స్కీం కింద సోమవారం ఉద్యోగోన్నతి కల్పించారు. నియామక పత్రాలను ఉపకులపతి ఆచార్య రామకృష్ణారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో రెక్టార్ మల్లికార్జునరెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగోన్నతి పొందిన వారిలో రామ్‌గోపాల్, మురళీధర్‌రావు, రఘునాథ రెడ్డి, అనిత, సదాశివారెడ్డి, శ్రీనివాసన్ ఉన్నారు.

గౌతమ్ స్కూల్లో న్యాయవిజ్ఞాన సదస్సు

తాడిపత్రి : బాలల దినోత్సవం పురస్కరించుకుని తాడిపత్రి పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్ నందు విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తాడిపత్రి ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పద్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..విద్యార్థి దశ నుండే చట్టం, హక్కుల పట్ల అవగాహన కలిగివుండాలని సూచించారు. ప్రతి విద్యార్థీ చట్టబద్ధులై నడుచుకుంటూ ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చంద్రమౌళి, తాడిపత్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, చక్రపాణి పాఠశాల కరస్పాండెంట్ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

శిశు మరణాలను నివారించాలి

రాప్తాడు : ఐదేళ్లలోపు పిల్లల మరణాలను తగ్గించాలని ఎఎన్‌ఎం నాగమ్మ సూచించారు. సోమవారం మండల పరిధిలోని జి.కొత్తపల్లి, గాండ్లపర్తి గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ దగ్గు, జలుబు, శ్వాస తీసుకోవడం డొక్కలు ఎగురవేయడం, అధిక జ్వరం, నీరసంగా, మత్తుగా ఉండడం, శ్వాస తీసుకునే సమయంలో గురకరావడం తదితర లక్షణాలు ఉంటే న్యూమోనియా భావించి వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చంద్రకళ, టీచర్ సరస్వతి, ఆశా కార్యకర్తలు విజయలక్ష్మి, ఓబులమ్మ, సిద్ధమ్మ, లక్ష్మీదేవి, రాధా, సుజాత, ముత్యాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల సమాచారం ఇవ్వాలని వినతి

అనంతపురం : జగనన్న ఇళ్లు.. పేదోళ్ల కన్నీళ్లు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం కట్టిస్తున్న ఇళ్ల సమాచారం ఇవ్వాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్ ఆధ్వర్యంలో హౌసింగ్ డిఇకి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఇళ్లు ఎంతవరకు పూర్తయ్యాయో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యక్రమాల ప్రధాన కార్యదర్శి భవాని రవికుమార్, నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షులు అంకె ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర, నగర ఉపాధ్యక్షులు గ్రంధి దివాకర్, నగర ప్రధాన కార్యదర్శులు, మేదర వెంకటేష్, భాస్కర్, వెంకటనారాయణ, హుస్సేన్, బాషా, జిల్లా కార్యదర్శులు రాపా ధనుంజయ్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : జగనన్న ఇల్లు పేదలకు కన్నీళ్లు కార్యక్రమంలో భాగంగా జనసేన పార్టీ నాయకులు జగనన్న ఇళ్ల కేటాయింపు, ప్రస్తుతం వాటి నిర్మాణం ఏదశలో ఉంది అన్న సమాచారం ఇవ్వాలని రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు, ఎంపిడిఒని సోమవారం వినతిపత్రాల ద్వారా కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికారి ప్రతినిధి సాకే మురళీకృష్ణ, జిల్లా కార్యదర్శి చొప్ప చంద్రశేఖర్, జిల్లా సంయుక్త కార్యదర్శి దేవరకొండ జయమ్మ, మండల కన్వనర్ ఎర్రిస్వామి, నాయకులు మన్నల పెద్దిరాజు, మునీంద్ర, తాహిర్, వంశీ తదితరులు పాల్గొన్నారు

నేడు మెడికల్ కళాశాలలో తెల్లకోటు ఉత్సవం

అనంతపురం : ప్రభుత్వ వైద్య కళాశాలలోని సెంట్రల్ హాలులో మంగళవారం ఉదయం 10 గంటలకు 2022వ బ్యాచ్ నూతన వైద్య విద్యార్థులకు పరిచయ కార్యక్రమం, తెల్ల కోటు ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఆచార్య డాక్టర్ మైరెడ్డి నీరజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి పర్యవేక్షకులు, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సూపరింటెండెంట్, వైస్ ప్రిన్సిపల్స్, అన్ని విభాగాల ప్రధాన విభాగాధిపతులు, ఆచార్యులు, సహాచార్యులు, దేశ నలుమూలల నుంచి వచ్చిన 2022వ బ్యాచ్ నూతన మెడికల్ స్టూడెంట్స్ పాల్గొంటారిని తెలియజేశారు.

జిల్లా క్రికెట్ అసోషియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా నార్పల సత్యనారాయణ రెడ్డి

నార్పల : ఆర్డీటీ ఉమ్మడి అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా వైసీపీ నాయకులు, జిల్లా సర్వజన వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు నార్పల సత్యనారాయణరెడ్డి ఎంపికయ్యారు. పలువురు క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు, మండల ప్రజలు ఆయనను అభినందించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో క్రికెట్ క్రీడా అభివృద్ధికి, క్రీడాకారులు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఎదిగే విధంగా సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తానని చెప్పారు.

ప్రతిపక్ష పార్టీలవన్నీ డ్రామాలే...

బుక్కరాయసముద్రం : ప్రతిపక్ష పార్టీలు తమ డ్రామాలని కట్టిపెట్టాలని బుక్కరాయసముద్రం జెడ్పిటిసి నీలం భాస్కర్ అన్నారు. రాష్ట్రంలో ఏ ప్రతిపక్ష పార్టీ అయినా ప్రజల పక్షాన పోరాటాలు చేస్తాయన్నారు. మన రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలైన టిడిపి, జనసేనలు తమ ఉనికిని కాపాడుకోవడం కోసం డ్రామాలాడుతున్నారన్న విషయం ప్రజలందరికీ తెలుసని అన్నారు. మొన్న ఇప్పటం గ్రామంలో జరిగిన సంఘటన, ఇప్పుడు జగనన్న కాలనీల్లో జరుగుతున్న సంఘటనలే ఇందుకు నిదర్శనం అన్నారు.టిడిపి వారు ఆడుతున్న నాటకంలో జనసేన నాయకులు పావులుగా మారొద్దని హితవుపలికారు. ఇప్పటికైనా మీ రాజకీయ భవిష్యత్తు కోసం ఆలోచించి ప్రజల పక్షాన నిలవాలని సూచించారు.

ఎమ్మెల్యే అనంతవి కాలం చెల్లిన విధానాలు : టిసి.వరుణ్

అనంతపురం : వైసిపి ప్రభుత్వానికి అభివృద్ధి చేయడం చేతకాక ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలపై ఆరోపణలు చేస్తోంది. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఇప్పటికీ కాలం చెల్లిన స్టాటజీ తోనే అనంతవీధుల్లో తిరుగుతున్నారని జనసేన అనంతపురం జిల్లా అధ్యక్షులు, అర్బన్ ఇన్‌ఛార్జి టిసి.వరుణ్ దుయ్యబట్టారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు ఈ నెల 12, 13వ తేదీల్లో జిల్లాలోని జగనన్న కాలనీల్లో పర్యటించి వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో తెలుసుకున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ సొంత ఇంటి కలలు నెరవేరుస్తామని అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని సిఎం జగన్మోహన్ రెడ్డిని డిమాండ్ చేస్తూ ఆయా కాలనీల్లో జనసేన నాయకులు కదం తొక్కారు. ఇందుకు ప్రతిగా స్పందించిన మంత్రి ఉష శ్రీచరణ్, పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిలకు జనసేన జిల్లా అధ్యక్షులు టి.సి.వరుణ్ అంతే స్థాయిలో కౌంటర్ ఇచ్చారు. మంత్రి ఉష శ్రీచరణ్ వాస్తవాలకు దూరంగా అవగాహన రాహిత్య వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి ఇప్పటినుండి ఓటమి భయం పట్టుకుందన్నారు. పవన్‌కళ్యాణ్ సిద్ధాంతాలు, పోరాట పటిమ పట్ల ఆకర్షితులవుతున్న ప్రజలు రానున్న ఎన్నికల్లో వైసీపీని కాలగర్భంలో కలుపుతారన్న ఆందోళన వైసిపి నేతల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. జగనన్న కాలనీల దుస్థితిపై పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డితో చర్చకు తాము సంసిద్ధమని టిసి.వరుణ్ ప్రతి సవాల్ విసిరారు. ప్రజల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోందని.. రానున్న ఎన్నికల్లో విజయం జనసేనదే అన్నారు. పవన్‌కళ్యాణ్ ఆదేశాలతో ప్రతి ఒక్క గృహ లబ్ధిదారునికి న్యాయం జరిగే వరకూ జనసేన రాజీలేని పోరాటాలు చేస్తుందని వరుణ్ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షులు అంకె ఈశ్వరయ్య, నగర్ ఉపాధ్యక్షులు గ్రంధి దివాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర, నగర ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేష్ పాల్గొన్నారు.